సాక్షి బాపట్ల

శనివారం, 15, ఏప్రిల్, 2023



జగనన్న కానుకల పరిశీలన

రొంపిచర్ల: మండల కేంద్రంలో భద్రపర్చిన జగనన్న విద్యా కానుకల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం రాష్ట్ర పరిశీలకులు, జాయింట్ డైరెక్టర్ మేరీచంద్రిక పరిశీలించారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.5,800, మోడల్ ధర రూ.4,700 వరకు పలికింది.

మరో ఐదు కేసులు



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఐదు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గుంటూరు ఏటీ అగ్రహారం, సంపత్‌నగర్‌లో ఒక్కొక్కటీ చొప్పున, ఇన్నర్‌రింగ్ రోడ్డులో మూడు కేసులొచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
బాపట్ల	6:28	4:35
గుంటూరు	6:28	4:35
నరసరావుపేట	6:30	4:32

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన రంజిత్ బాషా



బాపట్ల: జిల్లా నూతన కలెక్టర్‌గా పి.రంజిత్ బాషా పదవీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం మూడుగంటలకు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ బాధ్యతలు చేపట్టారు. కృష్ణాజిల్లా కలెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై బాపట్ల జిల్లా కలెక్టర్‌గా వచ్చారు. నూతనంగా బదిలీ పై వచ్చిన పి.రంజిత్ బాషాను జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ జె.డి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంత రావు, మత్స్య శాఖ జె.డి సురేష్, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, రెవెన్యూ డివిజనల్ అధికారులు రవీంద్ర, సరోజిని, పార్థసారధి, తహసీల్దార్లు కలసి పూలమాలలతో అభినందించారు.

సామాజిక న్యాయం సీఎం జగన్ వల్లే సాధ్యం

ఎంపీ మోపిదేవి, రీజినల్ కో ఆర్డినేటర్లు, భూమన, బీద మస్తాన్‌రావు



పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో సామాజిక న్యాయం సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణ, రీజినల్ కో ఆర్డినేటర్ బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. పర్చూరు అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం చీరాల మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అధ్యక్షతన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ, రీజినల్ కో ఆర్డినేటర్ బీద మస్తాన్‌రావు, తిరుపతి శాసన సభ్యుడు భూమన కరుణాకర రెడ్డిలు హాజరయ్యారు. సమావేశానికి ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సూచించిన వ్యక్తిని గెలిపించడమే కార్యకర్తల విధి అని అన్నారు. ఎంపీ, రీజనల్ కో ఆర్డినేటర్ బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ పెద్దల సభకు ఏ రాజకీయ పార్టీ ఇంతవరకు బీసీలను పంపలేదని, రాజ్యసభలో ఖాళీ అయిన తొమ్మిది స్థానాల్లో నాలుగు స్థానాలను బీసీలకు కేటాయించిన ఘనత కేవలం సీఎం జగన్‌కే సాధ్యమైందన్నారు. కులమత ప్రాంతీయ బేధం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం అని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి నియోజకవర్గ పరిశీలకుడు చుండూరి రవిబాబు, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీవితంలో ఎదిగేందుకు అవకాశాలను శోధించాలి



గుంటూరు లీగల్: జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు గల అవకాశాల్ని ప్రతి ఒక్కరూ శోధించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు సూచించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు శుక్రవారం గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి జీబీఏ అధ్యక్షుడు కె.వి.కె.సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కె.మన్మథరావు మాట్లాడుతూ సత్వర న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు ఎప్పుడూ సంసిద్ధులై ఉంటారని, తదనుగుణంగా న్యాయవాదులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమాన్ని బార్ కోశాధికారి జి.వి జయరాజ్ కుమార్ నిర్వహించారు. జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి వి.ఎ.ఎల్.సత్యవతి, నాలుగో అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.



గుంటూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, పక్కన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు చంద్రగిరి, జంగా, అప్పిరెడ్డి తదితరులు



డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పి. రంజిత్‌బాషా

స్ఫూర్తి మూర్తికి సలాం

రేపల్లె రూరల్: ప్రపంచ దేశాలకే స్ఫూర్తిప్రదాతగా నిలిచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మన దేశానికి చెందిన వ్యక్తికావటం దేశానికే గర్వకారణమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని ఉప్పూడి పంచాయతీ దాసరిపాలెంలో సర్పంచ్ గుజ్జర్లమూడి విజయబేబి-మాజీ ఎంపటీసీ ఇమ్మానుయేలు భాస్కర్‌ల ఆధ్వర్యంలో రూ.3 లక్షల ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం రాత్రి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. భారత రాజకీయ వ్యవస్థలో అణగారిన వర్గాల కోసం రాజ్యాంగం రచించి బడుగు, బలహీన వర్గాల వారికి రిజర్వేషన్ కల్పించి అంటరానితనం, కుల వ్యవస్థలను రూపుమాపారన్నారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆచరించినంత కాలం ఆయన ప్రజలలో సజీవుడిగానే ఉంటాడన్నారు.అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలను అందించేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి ఘనంగా జోహార్లర్పించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, సర్పంచ్ గుజ్జర్లమూడి విజయ బేబి, మాజీ ఎంపీటీసీ గుజ్జర్లమూడి ఇమ్మానుయేలు భాస్కర్, విగ్రహ ఆవిష్కరణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

అంబేడ్కర్ ఆశయాలతో ముందుకు సాగుదాం

బాపట్ల: డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరం ముందుకుపోద్దామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టరేట్‌లో డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నిర్వహించారు.

జిల్లా రెవెన్యూఅధికారి లక్ష్మీ శివజ్యోతి మాట్లాడుతూ డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిగా తీసుకుని ఉద్యోగులు ముందుకుపోవాలని జిల్లా రెవెన్యూ అధికారిణి లక్ష్మీ శివజ్యోతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాల నాయకులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డి.డి రాజ్ దిబోరా, బాపట్ల రెవెన్యూ అధికారి రవీంద్ర, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జె.డి హనుమంతరావు, మత్స్య శాఖ జె.డి సురేష్, దళిత సంఘాల నాయకులు జి.చారువాక, ఇనగలూరి మాల్యాద్రి, వందనము, శ్రీరాములు, దళిత సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన
ఐజీ పాలరాజ్

- మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- రేంజ్‌లో మంచి పోలీసింగ్‌ను నిర్వహిస్తాం
- సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం
- విలేకరుల సమావేశంలో వెల్లడి



నగరంపాలెం: గుంటూరు రేంజ్ ఐజీగా జి.పాలరాజ్ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు నగరం కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఐజీ కార్యాలయంలో శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో ఏలూరు రేంజ్ ఐజీగా విధులు నిర్వహిస్తున్న పాలరాజ్‌ను గుంటూరు రేంజ్ ఐజీగా బదిలీ చేసిన విషయం విదితమే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనపై నమ్మకంతో ఐజీ బాధ్యతలు అప్పగించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా విజిలెన్స్‌లో, డీజీపీ ప్రధాన కార్యాలయంలో టెక్నికల్ సరీ్వసెస్, దిశలో విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. గుంటూరు రేంజ్‌పై పూర్తిగా అవగాహన ఉందన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అన్ని విధాలుగా చర్యలు చేపడతామని చెప్పారు. అదే విధంగా మహిళలపై నేరాలు జరగకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

2021 నరసరావుపేటలో డిగ్రీ విద్యార్థిని అనూష హత్య కేసులో సహ విద్యార్థికి జీవితఖైదు, బీటెక్ విద్యార్థినీ రమ్య హత్య కేసులో నిందితుడికి ఉరి శిక్ష విధించారని ఐజీ గుర్తుచేశారు. రాష్ట్రంలోని పలువురు పోలీస్ ఉన్నతాధికారులకు ముఖ్యమైన కేసులను అప్పగించారని అన్నారు. అందులో రాష్ట్ర వ్యాప్తంగా 120 కేసులను అప్పగించగా, 68 కేసుల్లో నిందితులకు శిక్షలు పడినట్లు చెప్పారు. పలు కేసుల్లో నిందితులకు శిక్షలు విధించడం వల్ల సమాజంలో మార్పు తథ్యమని అన్నారు. గ్రామాల్లోని మహిళలకు నేరాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. అదే విధంగా గ్రామాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ప్రత్యేక కృషి చేస్తామన్నారు. నేరాలకు పాల్పడే వారికి శిక్షలు పడే విధంగా పోలీస్ పనిచేస్తుందని చెప్పారు. రేంజ్ పరిధిలో మంచి పోలీసింగ్‌ను నిర్వహించి, సత్ఫలితాలు సాధిస్తామన్నారు. సైబర్ నేరాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని, నేరం జరిగిన వెంటనే సమగ్రంగా వివరాలు తెలుసుకున్నట్లయితే 90 శాతం నేరాలు ఛేధించవచ్చునన్నారు.

సైబర్ క్రైం టోల్‌ఫ్రీం నంబర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. నేరాలు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు. ఉన్నతంగా చదువుకున్న కొందరు బయటకొచ్చి సైబర్ నేరగాళ్లగా అవతారం ఎత్తుతున్నారని చెప్పారు. పలురకాల లింక్‌లతో డబ్బులు గుంజేసుకుంటున్నారన్నారు. అర్బన్ పరిధిలోనే 70 శాతం మంది సైబర్ నేరాల బారినపడుతున్నారని, వీటన్నింటిపై రానున్న రోజుల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఐజీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఐజీని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికాఖర్గే, గుంటూరు ఏఎస్పీలు అనీల్‌కుమార్ (ఎల్అండ్‌ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), రేంజ్ పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందించారు.

వేటకు లంగరు!

- రెండున్నర నెలల పాటు సముద్రంలో వేట నిషేధం
- ఆదుకోనున్న మత్స్యకార భరోసా

చీరాల టౌన్: రెండున్నర నెలల పాటు సముద్ర తీర ప్రాంతాల్లో హైలెస్సా.. హైలెస్సా అనే మాటలు వినపడవు. తీరం ఒడ్డున మత్స్యకారుల సందడి కనిపించదు. సముద్రంలో మత్స్యకారుల బోట్లు కనిపించవు. సముద్రం బోసిగా దర్శనమివ్వబోతోంది. ప్రభుత్వం వేటపై నిషేధాజ్ఞలు జారీ చేసింది. కానీ వేట తప్ప మరో పని తెలియని మత్స్యకారుల పరిస్థితి ఈ సంధికాలంలో సుడిగుండంలో ఉన్న మత్స్యకారులకు అండగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలవనున్నారు.

మే 15 కల్లా గంగపుత్రులకు మత్స్యకార భరోసా కింద ఒక్కో మత్స్యకార కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందించేలా రూ.10 వేలు ఇవ్వనున్నారు. ఈనెల 15 నుంచి జూన్ 15 తేదీ వరకు సముద్రంలో చేపల వేట నిలుపుదల చేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారులు ప్రకటించారు. ప్రతిఏటా ఈ సమయంలో చేపలు పునరుత్పత్తి సమయం సందర్భంగా సముద్రంలో మరబోట్లు, యాంత్రీకరణ తెప్పలకు నిషేధ సమయంలో పూర్తిగా వేటను నిలుపుదల చేయాలని ఆదేశాలిచ్చారు. నిషేధ సమయంలో మత్స్యకారులకు వైఎస్సార్ సీపీ సర్కారు ఒక్కో కుటుంబానికి ఆర్థిక సాయం అందించనుంది. బాపట్ల జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలు ఉండగా రేపల్లె, బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో 9600 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి.



వాడరేవు తీరం ఒడ్డున నిలిపిన వలలు, పడవలు

బాపట్ల జిల్లాలో 50 వేల మత్స్యకారులు ఉండగా 25000 మంది మత్స్యకారులు వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఒక్కో బోటుకు ఆరుగురు మత్స్యకారులు ఉంటారు. బాపట్ల జిల్లాలో ఉన్న ఏడు తీరప్రాంత మండలాల్లో 76 కిలోమీటర్లు ఉన్న సముద్రతీర ప్రాంతంలో 50,000 మంది మత్స్యకార జనాభా, 9600 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. జిల్లాలో మోటారు, మెకనైజ్డ్ బోట్లు 2924 పైచిలుకు బోట్లు ఉన్నాయి. జిల్లాలోని రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్రతీర ప్రాంతం జిల్లాలోని రేపల్లెలోని లంకెనవాలిపల్లి దిబ్బ నుంచి చినగంజాం మండలం ఏటిమొగ వరకు తీరప్రాంతం విస్తరించి ఉంది. ఈ మండలాల్లోని మత్స్యకారులు సముద్రంలో వేట చేసి మత్స సంపదను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. జూన్ 14 వరకు సముద్రంలో వేట నిషేధం విధించడంతో మత్స్యకారుల వేట సామగ్రిని, బోట్లను ఒడ్డుకు తీసుకువచ్చి నిలుపుదల చేశారు.

కుటుంబ పోషణకు అండగా మత్స్యకార భరోసా..

సాధారణంగా వాడరేవు మత్స్యకారులు కృష్ణా జిల్లా మచిలీపట్నం, నెల్లూరు జిల్లా రామాయపట్నం వరకు వేటకు వెళ్లి గురకా, పాములు, బొంత, కూనాము, వంజరం, పండుగప్పలు లాంటి చేపలను పట్టుకొస్తుంటారు. నిషేధ కాలం రెండున్నర నెలలు ఉండటంతో మత్స్యకారులు ఇబ్బందులు ఇబ్బందులకు తొలగించేందుకు ప్రభుత్వం మత్స్యకార భరోసా అందిస్తూ అండగా నిలుస్తోంది.

బోట్లతో వేట సాగిస్తే చర్యలు



సముద్రంలో చేపల సంతానోత్పత్తి పెరిగే కారణంగా శనివారం నుంచి జూన్ 14 వరకు వేట నిషేధం అమలు చేస్తున్నాం. సంప్రదాయ తెప్పలు వేట సాగించుకోవచ్చనని, మెకనైజ్డ్ ఇంజిన్ బోట్లతో సముద్రంలో వేట సాగిస్తే చర్యలు తీసుకుంటాం. మత్స్యకారులు కేంద్రం ప్రభుత్వ ఆదేశాలు విధిగా పాటించాలి. మత్స్యకార భరోసా కింద బోట్లు పరిశీలన చేసి దరఖాస్తులను ఆన్‌లైన్ నిక్షిప్తం చేస్తాం. విచారణ చేసి మే 1న భరోసా తుది జాబితా ప్రకటిస్తాం. మేలో సీఎం జగన్ మత్స్యకారులకు భరోసా సాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు.

– ఎ.సురేష్, మత్స్యశాఖ జిల్లా అధికారి, బాపట్ల

దేశాయిపేటలో యువకుడి హత్య

- తలపై బండతో మోది హతమార్చిన వైనం
- పోలీసుల అదుపులో భార్య, అత్త

వేటపాలెం: ఇంట్లో ఉన్న వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన వేటపాలెం మండలం దేశాయిపేట అంబేడ్కర్‌నగర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నగంజాం మండలం సంతరావూరుకు చెందిన సలగల అజయ్ అలియాస్ నాని (40), భార్య సుభాషిణీ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. దేశాయిపేట పంచాయతీ అంబేడ్కర్ నగర్‌లో ఇల్లు కొనుగోలు చేసి 10 ఏళ్ల కిందట వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నారు.

మృతుడు ఇంకొల్లులోని స్పిన్నింగ్ మిల్లులో పనికి వెళ్తుంటాడు. భార్య సుభాషిణి ఇంటి దగ్గరలోని బీడీ కార్మికుల వైద్యశాలల్లో తాత్కాలిక ఉద్యోగిగా పగటి పూట పనిచేస్తోంది. అప్పుడప్పుడు రాత్రి సమయంలో ఇంకొల్లులోని స్పిన్నింగ్ మిల్లులో కూలీ పనికి వెళ్లి వస్తుంటుంది. అయితే గడిచిన అరు నెలలుగా మృతుడు తన భార్య ఎవరితోనో వివాహేతర సంబంధం పెట్టుకొందనే అనుమానంతో మద్యం తాగి వచ్చి తరచూ గొడవ పడుతుండే వాడు. భార్యభర్తలు రెండు పర్యాయాలు గొడవపడి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఒకరిపై ఒకరు కేసులు కూడా పెట్టుకున్నారు. రెండు నెలల కిందట కూడా వీరిద్దరి పంచాయతీ పోలీస్ స్టేషన్‌కి వెళ్లింది. భార్యభర్తలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపిస్తున్నారు.

అయితే శుక్రవారం ఉదయం తన భర్త ఇంటి ముందు చనిపోయి ఉన్నాడని భార్య సుభాషిణి పెద్దగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు, వేటపాలెం ఎస్సై జి.సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అజయ్ తల పగిలిపోయి ఇంటి ముందు మృతి చెందిపడి ఉన్నాడు. ఇంటిలోపల పరిశీలించగా రక్తపు మరకలు నీటితో కడిగిన ఆనవాళ్లు ఉన్నాయి. ఇంట్లో చంపి మృతదేహాన్ని బయటికి తీసుకొచ్చి డాబాపైకి తీసుకెళ్లి అక్కడ నుంచి తిరిగి కిందికి తీసుకొచ్చి ఇంటి ముందు పడేసినట్లు రక్తపు మరకలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మల్లికార్జునరావు

మృతుడిని ఇంట్లోనే హతమార్చి డాబాపై నుంచి కిందపడి చనిపోయినట్లుగా అనుమానాలు సృష్టించేందుకే హంతకులు ప్రయత్నించినట్లు పోలీసులు భావిస్తున్నారు. అనంతరం ఒంగోలు నుంచి డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం బృందాన్ని రప్పించి పరిశీలించారు. డాగ్ ముందుగా ఇంట్లోకి వెళ్లి అక్కడ నుంచి డాబా పైకి వెళ్లి వచ్చింది. అక్కడి నుంచి దగ్గరలోని రొంపేరు మురుగు కాలవ వద్దకు వెళ్లింది. రొంపేరు వద్ద మృతుడి రక్తపు మరకలు తుడిచిన గుడ్డలను పోలీసులు గుర్తించినట్లు సమచారం. ఈఘటనపై కేసు నమోదు చేసి మృతుడు భార్య, అత్త నాగమ్మని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

పశ్చిమకు 416 క్యూసెక్కులు



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో బ్యాంక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 258 క్యూసెక్కులు,, నిజాంపట్నం కాలువకు 110 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 100 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 526.60 అడుగుల వద్ద ఉంది. ఇది 161.5866 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 4,707, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 3,533,ఎస్ఎల్‌బీసీకి 1,772, వరద కాలువకి 225 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 10,746 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 4,128 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.80 అడుగుల వద్ద ఉంది. ఇది 31.4403 టీఎంసీలకు సమానం.

క్లుప్తంగా

రేంజ్ ఐజీని కలిసిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



ఐజీ పాలరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: గుంటూరు రేంజ్ నూతన ఐజీగా బాధ్యతలు స్వీకరించిన పాలరాజును శుక్రవారం ఎస్పీ వకుల్‌జిందాల్ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏలూరు రేంజ్ ఐజీగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు రేంజ్ ఐజీగా నియమితులైన ఐజీ పాలరాజుకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రపంచ ప్రయాణికుల ఫెస్టివల్‌కు బాపట్ల జిల్లావాసి



ఇత్తడి సుబ్బారావు

మేదరమెట్ల: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన దళిత యువ పారిశ్రామికవేత్త ఇత్తడి సుబ్బారావుకు ఆస్ట్రియా రాజధాని వియన్నాలో జరిగే ప్రపంచ ప్రయాణికుల ఫెస్టివల్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. కోవిడ్ సమయంలో ప్రజా రవాణా వ్యవస్థ నష్టాల బాటలో నడిచాయి. ఇప్పటికీ కోలుకోలేదు. వాటన్నింటినీ తాను చేసిన ప్రయోగంతో లాభాల బాట పట్టించవచ్చని సుబ్బారావు చెబుతున్నాడు. బస్సు, రైలు, విమానాల్లో వర్క్ ఆన్ వీల్స్ ప్రయోగం అమలు ద్వారా ఆయా వాహనాల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం వస్తుందని చెబుతున్నారు. తాను చేసిన ప్రయోగంపై ప్రపంచ ప్రయాణికుల ఫెస్టివల్‌లో ప్రజా రవాణా సంస్థలతో చర్చించే అవకాశం తనకు దక్కిందని సుబ్బారావు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మాధవనాయుడు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, మున్సిపల్ కమిషనర్

చీరాలటౌన్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ముఖ్య అగ్నిమాపక శాఖ అధికారి సి.మాధవనాయుడు, చీరాల మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సిబ్బంది అగ్నిమాపక పతాకానికి గౌరవ వందనం చేశారు. వారు మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. చిన్నచిన్న ప్రమాదాలను ముందుగానే గుర్తించి వాటిని నివారించవచ్చన్నారు. సరైన అవగాహన లేకపోవడం వలనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అలానే ఏదైనా ప్రమాదం జరిగితే అగ్నిమాపక వాహనం వచ్చే సమయంలోగా ప్రాథమికంగా ప్రజలే స్వయంగా మంటలు అదుపుచేసేందుకు పలు రకాల చర్యలు చేపట్టాలన్నారు. 1944 ఏప్రిల్ 14న ముంబైలోని దాల్ యార్డు నందు జరిగిన అగ్నిప్రమాదంలో 336 మంది ప్రయాణికులతో పాటు 66 మంది సిబ్బంది కూడా మరణించారని, వారి స్మృతికి చిహ్నంగా ఏప్రిల్ 14వ నుంచి 20వ తేదీ వరకు దేశమంతటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారం రోజులపాటు అగ్నిప్రమాదాలను నివారించే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ అధికారి సునీల్ కుమార్, ఐటీసీ ఈహెచ్ఎస్ మేనేజర్ ఎంఎస్ఎన్ రెడ్డి, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాసరావు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ



జగజ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణ మాదిగ

తెనాలిఅర్బన్: బాబూ జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించకపోవడం బాధాకరమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలి చెంచుపేట ఇందిరానగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని గురువారం రాత్రి ఆవిష్కరించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభకు న్యాయవాది ఇందుపల్లి రాజారాం అధ్యక్షత వహించారు. కృష్ణ మాదిగ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ కృషి ఫలితంగా ఈ రోజు రిజర్వేషన్లు అనుభవిస్తున్నామని గుర్తు చేశారు. అంతే కాకుండా 1950 నుంచి ప్రతి పది సంవత్సరాలకు రిజర్వేషన్లను పొడిగించే విషయంలో ఆయన ఎంతో చొరవ చూపారని చెప్పారు. కొంత మంది కుట్రఫలితంగా ఆయన భారతదేశానికి అందించిన సేవలు మరుగున పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతరత్న ఇచ్చే వరకు పోరాట చేస్తామని ప్రకటించారు. అలాగే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సాధనకు త్వరలో కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీలు ఉపకులాల నాయకులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టులో ఉన్న రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై కూడా న్యాయ నిపుణులను సంప్రదించి కోర్టు నుంచి సానుకూల తీర్పు వచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, ఏపీపీలు సుద్దపల్లి సుకుమార్, పి.సునీల్, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి కె.బాబూరావు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వ వైద్యం

- కరోనాలో ప్రాణాలు తెగించి వైద్య సేవలు అందించిన వైద్యులు
- సంతృప్తికరంగా ప్రాణాలు నిలబెట్టే సాయం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు.
- ఏరియా వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్, జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, కలెక్టర్ లోతేటి శివశంకర్, డీసీహెచ్ డాక్టర్ రంగారావు తదితరులు

సత్తెనపల్లి: ప్రాణమే ముఖ్య మనుకున్న రోజుల్లో ప్రాణాలకు తెగించి ప్రభుత్వ వైద్యులు కరోనా రోగులకు సేవలందించారని, పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని అండగా నిలిపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.65 లక్షలతో 500 లీటర్ల సామర్థ్యం కలిగిన నూతన ప్రాణవాయు ఉత్పత్తి కేంద్రం (ఆక్సిజన్ ప్లాంట్), రూ.45 లక్షలతో 250 కేవీ సామర్థ్యం కలిగిన నూతన జనరేటర్, రూ.60 లక్షలతో 315 కేవీ సామర్థ్యం కలిగిన నూతన త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ప్రారంభోత్సవంలో శుక్రవారం నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతోటి శివశంకర్‌తో కలసి ఆయన హాజరయ్యారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యులు మానవతా దృక్పథంతో సేవలందించాలని సూచించారు. 100 పడకల వైద్యశాలగా పూర్తిస్థాయిలో ఏరియా వైద్యశాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులైన కొత్త రామకృష్ణ, ఖాజా తదితర బృందం వైద్యశాలలో రూ.కోటి విలువైన వస్తువుల, సేవల రూపంలో సహకారం అందించారన్నారు. వారి సహకారం అభినందనీయమన్నారు. ప్రత్యేకించి కొత్త రామకృష్ణ సేవాభావాన్ని కొనియాడారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మెడికల్ కళాశాలలు నిర్మించడం, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, సిబ్బందిని నియమించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా కృషి చేయాలని సూచించారు. ఉత్తమంగా సేవలందిస్తున్న సిబ్బందిని ప్రశంసించారు. ముందుగా జనరేటర్‌ను మంత్రి అంబటి రాంబాబు, ఆక్సిజన్ ప్లాంట్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కలెక్టర్ లోతేటి శివశంకర్‌లు ప్రారంభించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీహెచ్ డాక్టర్ రంగారావు, సత్తెనపల్లి ఆర్డీవో బీఎల్ఎన్ రాజకుమారి, ఏపీఎంఎస్ ఐడీ ఈఈ శ్రీధర్, ఏపీఎం ఎస్ఐడీ డీఈ భాగ్యలక్ష్మి, ఏపీఎంఎస్ ఐడీ ఎలక్ట్రికల్ ఇంజినీర్ వెంకట్, . ధనుంజయ్, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ స్టాలిన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కరరెడ్డి, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ ఎస్.రాజమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు షేక్ మౌలాలి, షేక్ జానీ, ఎస్ఎం యూనస్, పెద్దింటి వెంకటేశ్వర్లు, వెలుగూరి శరత్, తోట కృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

సంప్రదాయ కళ కూచిపూడి నృత్యం

డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

అద్దంకి: కూచిపూడి నృత్య కళ ఒక సంప్రదాయ నృత్య కళ అని డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం పట్టణంలోని మాధవస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన పురస్కార కార్యక్రమానికి ఆయన పుట్టంరాజు పురస్కార గ్రహీతగా హాజరయ్యారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాలికలు ప్రదర్శించిన నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కూచిపూడి ఆంధ్రుల నాట్య కళ అన్నారు. లయ, లాస్యాలతో వేగవంతమైన నృత్యంతో కూడకున్న కళ అని చెప్పారు. ఇందులో పాటకు సంబంధించిన హావభావాలు స్పష్టంగా ప్రదర్శింపబడతాయని చెప్పారు. శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం కూచిపూడి నృత్య కళలలో దేశ విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన శిష్యులు దేశా విదేశాల్లో ఉన్నారన్నారు. డీవీఎం సత్యనారాయణ మాట్లాడుతూ నాట్యానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన నాట్యాచార్యుల్లో డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం ఒకరన్నారు. 200 మందికిపైగా వారి శిష్యులు ఆ కళను ఆసక్తి ఉన్నవారికి అందిస్తున్నారని కొనియాడారు. తరువాత వారణాశి రఘురామశర్మ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం శిష్యుడు త్రోవగుంట చందూ డాన్స్ అకాడెమీ విద్యార్థులు ప్రదర్శించిన నాట్యం అందరిని ఆకట్టుకుంది. అనంతరం సుబ్రహ్మణ్యాన్ని ఘనంగా పురస్కారంతోపాటు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో లక్కరాజు శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకర్‌రావు, వామరాజు వెంకటేశ్వర్లు, కేవీ పోలిరెడ్డి, ఓరుగంటి శ్రీనివాసరావు, సీహెచ్ వీరయ్య, మారం కోటేశ్వరరావు, కే కుమార్, పీ ఆంజనేయులు, కే శివరామ కోటేశ్వరరావు, కొలలపూడి శ్రీనివాసరావు, మిట్టా కామేశ్వరశర్మ, ఎన్ నాగేశ్వరరావు, ఎస్ బాబు, జీ హరనాథ్, అద్దంకి లేవీ ప్రసాద్, పీసీహెచ్ కోటయ్య, అంజాద్ బాషా, సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోండి

ఎస్పీ వకుల్‌జిందాల్



రైల్వేస్టేషన్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. అంబేడ్కర్ 132వ జయంతిను పురస్కరించుకొని పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి, జిల్లా పోలీస్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ వకుల్‌జిందాల్ పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ దేశంలో అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడానికి డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విశేషకృషిచేశారన్నారు. భారతదేశ రాజ్యాంగానికి దిశానిర్దేశం చేసిన మహోన్నతవ్యక్తి బిఆర్ అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి. మహేష్, బాపట్ల డీఎస్పీ ఎ. శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ3 ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బీ సీఐ ఎ. శ్రీనివాస్, బాపట్ల పట్టణ, రూరల్ సీఐ పి. కృష్ణయ్య, జి. వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

సౌత్ ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ప్రవీణ్‌కుమార్



చీరాల రూరల్: సౌత్ ఇండియా మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు చీరాల మండలం బుర్లవారిపాలెం పంచాయతీ సాయికాలనీకి చెందిన దేవరకొండ ప్రవీణ్ కుమార్ 96 కేజీల విభాగంలో ఎంపికయ్యారు. ఈ మేరకు ఇండియన్ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ నుంచి ఆహ్వానం అందినట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పోటీలు ఈనెల 15న హైద్రాబాద్‌లో ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం ఈయన బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒక వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ మరోవైపు తన కిష్టమైన వెయిట్ లిఫ్టింగ్‌లో సాధన చేస్తున్నారు. గతంలో ఈయన అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాడు. పోటీలకు ఎంపికై న ప్రవీణ్‌కుమార్‌ను ఉమ్మడి ప్రకాశం జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ డాక్టర్ పున్నారావు, రిటైర్డు డీఎస్‌డీవో శ్రీనివాస ప్రసాద్‌లతో పాటు పలువురు క్రీడా ప్రేమికులు అభినందించారు.

భావితరాలకు దిక్సూచి బాబా సాహెబ్



కొత్తసాలసలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరిస్తున్న రాజకుమారి

యడ్లపాడు: భావితరాలకు బాబాసాహెబ్ అంబేడ్కర్ దిక్సూచి అని ఏపీఎస్పీ డీఐజీ బి. రాజకుమారి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొత్తసాలసలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు.ముందుగా జై భీమ్ యూత్ సభ్యులు నీలిరంగు జెండాలతో యడ్లపాడు 16వ నంబర్ జాతీయ రహదారి నుంచి అతిథులతో కలసి కొత్త సాలస వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఆర్ అండ్ బీ రోడ్డు పక్కనే నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని రాజకుమారి, సెబ్ సీఐ బాలయ్య దంపతులు, జై భీమ్ కమిటీ, ఇతర అతిథులతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో రాజకుమారి మాట్లాడారు. పండితులకే పండితుడు, మహోపాధ్యాయులకే మహోపాధ్యాయుడు, చరిత్రకారుడు, విజ్ఞానం, పరిజ్ఞానం కలిగిన మేధావి, సామాజిక, ఆర్థిక, తత్వవేత్త, భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత వంటి అనేక బిరుదులు కలిగిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తనకు లభించిన పూర్వజన్మ సుకృతం.. అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ప్రతి పల్లెలో కనిపించే అంబేడ్కర్ విగ్రహం తమ భవిష్యత్తును నిత్యం కొత్తమార్గంలో తీర్చిదిద్దుకోవాలని సూచిస్తుందని, చూపుడు వేలు చూపించడంలో ఉన్న అంతర్యాన్ని యువత గ్రహించాలని ఆమె తెలిపారు. అంబేడ్కర్ జయంతి నాడు ఇంతటి గొప్పకార్యాన్ని తలపెట్టిన జైభీమ్ సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ దాసరి బాలయ్య, భట్టిప్రోలు ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ అధినేత యడ్ల సునీల్, జై భీమ్ రాష్ట్ర కార్యదర్శి పిల్లి రాజు, కాకుమాను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శీలం రవిబాబు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

గుంటూరువెస్ట్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది వైద్య పరీక్షలు, ఆరోగ్య పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. శని, ఆదివారాలు నిర్వహించనున్న మెగా మెడికల్ క్యాంపునకు సంబంధించి స్థానిక కలెక్టరేట్ ఆవరణతోపాటు శంకరన్ సమావేశ మందిరంలో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు ఏర్పాట్లు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించేటప్పుడు ఎంత క్రమ శిక్షణతో ఉంటారో, ఆరోగ్యం, కుటుంబ బాధ్యతల్లో కూడా అదే విధంగా ఉండాలన్నారు. ఒక వ్యక్తిపై ఆధారపడి ఒక కుటుంబం ఉంటుందన్న సత్యాన్ని మరువకూడదని చెప్పారు. గుంటూరులోని ప్రముఖ ఆసుపత్రులైన లలిత సూపర్ స్పెషాలిటీ, మణిపాల్, శ్రీ హాస్పిటల్, ఆదిత్య, అగర్వాల్ కంటి ఆస్పత్రి, ప్రత్యూష డెంటల్ తదితర ఆసుపత్రులకు చెందిన వైద్యులు హాజరవుతారన్నారు. మొత్తం 17 రకాల టెస్టులు నిర్వహిస్తారని చెప్పారు.

ఒడ్డుకు కొట్టుకువచ్చిన మృతదేహం

చీరాలటౌన్: స్నేహితులతో సరదాగా గడిపేందుకు వెళ్లిన ఐదుగురు మిత్రుల బృందంలో బుధవారం రామాపురం తీరంలో గల్లంతైన ఇద్దరిలో రెహమాన్ మృతదేహం శుక్రవారం వాడరేవు తీరానికి కొట్టుకువచ్చింది. గంజిపాలేనికి చెందిన ఇర్ఫాన్, రెహమాన్‌లు బుధవారం రామాపురం తీరంలో గల్లంతుకాగా అదే రోజు రాత్రికి ఇర్ఫాన్ మృతదేహం ఒడ్డుకు చేరింది. శుక్రవారం రెహమాన్ మృతదేహం కూడా లభ్యమైంది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

27 ద్విచక్రవాహనాలు స్వాధీనం



అమరావతి: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలో సమస్యాత్మక గ్రామాలలో విస్తృత తనిఖీలు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేకువజామున మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సుమారు మూడు గంటలపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, సీఐ వీరాస్వామి, 11మంది ఎస్ఐలు మరో యాభైమంది సిబ్బందితో కలిసి నరుకుళ్లపాడు గ్రామాన్ని ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ రికార్డులు, పత్రాలు సరిగా లేని 27ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని అమరావతి పోలీస్‌స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

నిప్పుల కొలిమిలా రెంటచింతల

రెంటచింతల: రెంటచింతల శుక్రవారం నిప్పుల కొలిమిలా మారింది. గరిష్ఠ ఉష్ణోగ్రత 44.6, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.3 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. ఈ ఏడాది ఇక్కడ నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇది. ఉదయం 10గంటల నుంచే వడగాడ్పులు వీస్తుండటంతో వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణులు పలు అవస్థలకు గురవుతున్నారు. ఎండ తీవ్రత నుంచి కొబ్బరి బొండాలు, చెరుకురసం, శీతల పానీయాలతో కొంత వరకు సేదతీరుతున్నారు. గతంలో రెంటచింతలలో 49 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైన సంఘటనలు ఉన్నాయి. వేసవి ప్రారంభంలోనే 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో మేలో పరిస్థితి ఎలా ఉంటుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.